بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 13.04.2018 (Telugu)**

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములను చదివి మన ధార్మిక విద్యను పెంచుకొనుటకు మనము శ్రద్ధ చూపవలెను, ఖిలాఫత్‌తో సంబంధమును పెంచుకొనుటకు ప్రయత్నించవలెను, ఇందుకు అల్లాహ్ తఆలా అందించిన ఎమ్.టి.ఏ. వరముతో లబ్ది పొందవలెను, వర్తమాన ఖలీఫా కార్యక్రమాలన్నిటితో ప్రయోజనము పొందవలెను

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 13.04.2018 తేదీన - మస్జిద్ మస్జిద్ బషారత్, స్పెయిన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. నేడు ప్రపంచములో నలు వైపులలో అశాంతి, పీడనము రాజ్యమేలుతున్నది. ఒక చోట మతము పేరున అశాంతి ప్రజ్వరిల్లుచున్నచో మరో చోట ప్రాపంచిక శక్తి, పై చేయి సాధించుకొనుటకు అశాంతి రగులుచున్నది. మరో వైపు బీదరికము, ధనికత్వమును ఎదురించినందుకు అశాంతి ఏర్పడుచున్నది. మరో వైపు రాజకీయ సమితుల ప్రభుత్వ అధికారాలను కైవసం చేసుకొనుటకు అశాంతి, పీడనము ఏర్పడుచున్నది. ఇంకా గృహములలో చిన్న చిన్న విషయముల వలన వివాదములు, పీడనము ఏర్పడుచున్నది. ఇదే విధముగా ఒకరు మరొకరి హక్కులు చెల్లించనందున వివాదములు, పీడనము ఏర్పడుచున్నది. వంశపరమైన ఆధిక్యతను నిరూపించుటకు పీడనము సృష్టించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. మరో ప్రక్క తమ హక్కులు సాధించుకొనుటకు తప్పుడు పద్ధతిని అవలంభించి పీడనము, అశాంతిని సృష్టించుటకు కృషి జరుగుచున్నది. సారాంశమేమనగా ఎటు చూచినా అశాంతి, పీడనము ప్రపంచమును పీడించుచున్నది. దీనితో పేదలు సురక్షితముగా లేరు, ధనికులు కూడ సురక్షితముగా లేరు. ధనిక దేశాలు కూడ దీనితో సురక్షితముగా లేవు పేద దేశములు కూడ దీనితో సురక్షితముగా లేవు. తనను తాను ప్రగతి చెందినవారిగా భావించుచున్న వ్యక్తి ఇది విద్య, వివేకము, కాంతి కాలమని భావించును. కాని వాస్తవముగా అంధకారములో మునిగి వున్నారు. అల్లాహ్ తఆలాను విస్మరించి ప్రపంచమును పొందుట, దానినే తమ ఆరాధ్య దైవముగా, పోషకునిగా భావించి వినాశన గుండము వైపు వెళ్లుటయే కాక దానికి సమీపములో వున్నారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ముస్లిముల వద్ద ఒక గొప్ప, సంపూర్ణ పుస్తకము తన అసలు స్థితిలో గలదు. కనుక వారిపై ఆశ్చర్యమగుచున్నది. అల్లాహ్ తన వాగ్దానము మేరకు ఈ కాలపు ఇమామ్‌ను పంపెను. అతడే విభేదాలను దూరము చేయవలసి వుండెను. కాని ముస్లిములు విభేదాలను, పీడనమును దూరము చేయవలసిన ఆ అవతారుని మాటలు వినే బదులు, అతన్ని ఆశ్రయించే బదులు అశాంతికి కారకులగుచున్న పండితులను అధిక ముస్లిములు అనుసరించిరి. ప్రపంచములో గల పీడనమును అంతము చేయుటకు, పరస్పరం ప్రేమానురాగము, సోదరభావము సృష్టించుటకు, అల్లాహ్ తఆలాను గుర్తించుటకు అల్లాహ్ తఆలా ఏర్పాటు చేసిన వ్యవస్థ వైపు ముస్లిములు ఎలాంటి శ్రద్ధ చూపలేదు. అందుకే నేడు ముస్లిమ్ ప్రపంచము అందరికంటే ఎక్కువ అశాంతిని ఎదుర్కొంటున్నది. వారి మత పెద్దలు, రాజకీయ నాయకులు వారిని అంధకారములోకి నెట్టుచున్నారు. ఒకే దేశములో నివసించుచున్న నగరవాసులు పరస్పరం రక్తపాతానికి పాల్పడుచున్నారు. ఈ అవకాశమును సద్వినియోగం చేసుకుంటూ ముస్లిమేతరులు ముస్లిం వర్గములను అంతర్యుద్ధానికి దించుచు తమ స్వార్థములను పొందుటకు యుద్ధ సామాగ్రి కూడ అందించుచున్నారు. సైన్యము కూడ సహాయము చేయుచున్నది. ఇది చాలా పెద్ద సమస్య. ఈ స్థితి మనందరిని సాధారణ ముస్లిములందరి కొరకు దుఆ చేయాలని సూచించుచునట్లే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనలో చూడదలచిన ఆచరణాత్మక, ఆధ్యాత్మిక మార్పులు కూడ సృష్టించుకోవలసిన అవసరమున్నది. వారు మనలో చూడదలచిన ఆచరణాత్మక స్థితులు మనలోని లేనిచో అశాంతి, పీడనమును

ఎదుర్కొంటున వర్గములో మనము కూడ చేరే అవకాశమున్నది. బైఅత్ తరువాత మీ స్థితులు ఎట్లుండవలెనని హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పదే పదే తమ జమాఅత్‌నకు ఉపదేశించారు. హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పలు పంక్తులను నేనిప్పుడు వినిపిస్తాను. అవి మనందరికి ఇటు వైపు శ్రద్ధ కలిగించును. కనుక మనము వీటి వైపు దృష్టి సారించవలెను. ఇంతకు ముందు అనేక సార్లు విన్నాము లేదా చదివినామని భావించకుము. ఏ విధముగా ఎంతగా పదే పదే హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ స్థితులలో మార్పులను మెరుగుపరచుకోవాలని సూచించారో తమ జమాఅత్ తమ ఉద్దేశమును మరచిపోకూడదని, బైఅత్ తరువాత వారిలో చెడు చేరకూడదని, మరల అంధకారము వైపు పోకూడదని వారికి గల ఆందోళనను తెలుపును.

హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఈ కాలములో అంధకారము, దుర్మార్గము, నిర్లక్ష్యము రాజ్యమేలుచున్నందున దైవభీతిని అలవర్చుకోవలెను. ప్రపంచములో నేడు అల్లాహ్ తఆలా ఆదేశములకు గౌరవము లేదు. హక్కులు, ఆదేశములను లెక్క చేయడం లేదు. మన హక్కులు ఏమిటో లేదా మనమెలా చెల్లించవలెనని కూడ తెలియదు. ఆదేశించబడిన విషయముల పట్ల శ్రద్ధ కూడ లేదు. ప్రపంచము, దాని పనుల పట్ల మితిమీరిన ఆసక్తి గలదు. ఏమాత్రం నష్టం వాటిల్లినా ధార్మికత్వమును వీడుతారు. అల్లాహ్ తఆలా హక్కులను నెరవేర్చరు. స్వార్థముతో పరస్పరం వ్యవహరిస్తారు. తుచ్ఛ కోరికలను ఎదురించడంలో ఎంతో బలహీనులుగా వుంటారు. చిన్న సంఘటనపై కూడ మానసిక కోరికలకు తలొగ్గుతారు. వారిని అల్లాహ్ తఆలా బలహీనం చేసినచో వారు పాపమునకు సాహసించరు. బలహీనత కొంచెం దూరమై పాపమునకు అవకాశము లభించినచో పాపమునకు పాల్పడుతారు. నేడు ఈ కాలములో ప్రతి చోట మీరు అన్వేషించినచో నిజమైన దైవభీతి కనుమరుగైనదని తెలియును. నిజమైన విశ్వాసము లేనే లేదు. కాని వారి నిజమైన దైవభీతి, విశ్వాసమును వృథా కానివ్వకూడదని అల్లాహ్ తఆలా ఆశించినందున పంట పూర్తిగా నాశనమగుచున్నదని చూడగానే మరో పంటను పండిస్తాడు. పవిత్ర ఖుర్‌ఆన్ అదే తాజా పంట రూపంలో గలదు. అల్లాహ్ తఆలా ఇట్లనెను. إِنَّا نَحْنُ نَزَّلْنَا الذِّكْرَ وَإِنَّا لَهُ لَحَافِظُونَ అనగా మేమే ఈ స్మరణ (ఖుర్‌ఆన్)ను అవతరింపజేసితిమి మేమే దానిని రక్షింతుము. ఇట్లనిరి. హదీసులు కూడ చాలా వున్నాయి. శుభములు కూడ గలవు. కాని హృదయములలో విశ్వాసము, ఆచరణాత్మక స్ఫూర్తి లేనే లేదు. ఈ విషయములు మరల పుట్టాలని అల్లాహ్ తఆలా నన్ను పంపెను. ఈ మైదానము ఖాళీగా వుండుటను అల్లాహ్ తఆలా ఇష్ట పడలేదు. దుష్టత్వములు వ్యాపించుచున్నందున అల్లాహ్ తఆలా ప్రకోపము, దైవత్వము ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చే వారితో ఈ మైదానమును నింపుటకు మరల కోరెను. ధర్మమును జారీ చేయువారైనను, ధర్మమును వ్యాపింపజేయువారైనను, ధర్మమును ఆచరించేవారైనను కావచ్చును. అందుకే దైవభీతితో కూడిన జీవితమును పొందగలరని మేము ప్రచారము చేయుచున్నాము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నిజమైన బైఅత్ చేసినచో జీవితులలో చేరవలెను. ఆధ్యాత్మిక జీవితులలో చేరవలెను. లేనిచో ఎలాంటి ప్రయోజనం లేదు. ఇస్లాం వాస్తవికత ఏమిటి? దానిని మనమెట్లు పొందవచ్చును. దీని గురించి హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

అల్లాహ్ తఆలా ఆదేశములన్నిటిని పాటించుటయే ఇస్లాం అనబడును. దాని సారాంశము అల్లాహ్ తఆలాకు నిజమైన, సంపూర్ణ విధేయులుగా కావడమే. తమ ఉనికిని మొత్తం అల్లాహ్ తఆలాకు అప్పగించువారే ముస్లిములు. مَنْ أَسْلَمَ وَجْهَهُ لِلّٰهِ وَهُوَ مُحْسِنٌ అనగా తమ ఉనికిని మొత్తం అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు అంకితం చేసినవారే ముస్లిములు. విశ్వాసపరంగా, ఆచరణాత్మకంగా అతని ఉద్దేవము అల్లాహ్ తఆలా ప్రీతి, సంతోషమే కావలెను. అతనిచే సత్కర్మలు అతి కష్టము, అయిష్టతో సంభవించకూడదు. వాటిలో ఒక ఆనందము, మధురత్వము కలుగుటకు కృషి చేయవలెను. ఈ కర్మల ప్రతిఫలము శూన్యమని చెప్పబడినను తమ సత్కర్మలు, దైవ ప్రేమను వీడని వారే నిజమైన ముస్లిములు. అల్లాహ్ తఆలాతో ఇటువంటి నిస్వార్థ ప్రేమను ఏర్పాటు చేయాలని వారు ఆశించిరి. ఏమియును లభించకున్నను అల్లాహ్ తఆలాతో ప్రేమ వుండవలెను. అతని ఆరాధన, అతనితో సంబంధము, అతని విధేయత, వినమ్రతలో ఏమియును ఆశించకుండానే లీనము కాలవెను. అల్లాహ్ తఆలాను గుర్తించుట, అతని ప్రేమ, అతని విధేయత కొరకే తన ఉనికి పుట్టించబడెనని, ఇది తప్ప మరో ఉద్దేశము అతనికి లేదని అతను భావించును. అందుకే దైవ ప్రసాదిత శక్తులను ఈ ఉద్దేశములు, లక్ష్యముల కొరకు మాత్రమే వినియోగించినప్పుడు

అతనికి తన నిజమైన ప్రియుని ముఖము కనిపించును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా ఆదేశములను తు.ఛ. పాటించుట, కేవలము అతని ప్రీతిని మాత్రమే పొందుట ఏదో సులభమైన విషయము కాదని కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్పష్టము చేసిరి. ఇందుకు శక్తిమేర ప్రయత్నము చేసినప్పుడే అహ్మదీ అయిన ఉద్ధేశము పూర్తి అగును. వారిట్లనిరి.

సంపూర్ణ విధేయత పాటించనివారు ఈ సంస్థను అపనిందకు గురి చేయువారగును. ఆదేశము ఒక్కటి కాదు, చాలా ఆదేశములున్నవి. స్వర్గమునకు అనేక ద్వారములు వున్నవి. ఒకరు ఒక ద్వారము నుండి ప్రవేశించగా మరొకరు మరో ద్వారము నుండి ప్రవేశింతురు. ఇదే విధముగా నరకమునకు కూడ అనేక ద్వారములు గలవు. ఒక దానిని మీరు మూసి వేసి మరో దానిని మీరు తెరుచుకోకూడదు. పేరు వ్రాయించగానే జమాఅత్‌లో ఎవరు ప్రవేశించరు. పరస్పరం అనురాగం ఏర్పాటు చేసుకోగలరు. ఇతరుల హక్కులను హరించకుము. అల్లాహ్ తఆలా మిమ్ములను కరుణించుటకు అతని మార్గములో పూర్తిగా లీనమగుము.

ఒక సందర్భమున దైవభీతి ప్రాముఖ్యతను తమ జమాఅత్‌నకు తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

దైవభీతి మైదానము ఖాళీగా వున్నదని అల్లాహ్ తఆలా నన్ను పంపెను. ధర్మమును వ్యాపింపజేయవలెను. ధర్మ ప్రచారము చేయవలెను. సంస్కరణ చేయవలెను. దైవభీతిని మొదట తమలో కలిగించుకొనుము. దైవభీతి వున్నప్పుడే మిగతా పనులన్ని క్రమేణ చక్కదిద్దుకొనును. మీలో దైవభీతి వున్నచో ప్రపంచమంతా మీకు తోడుండును. కనుక దైవభీతిని ఏర్పరచుకొనుము. మద్యము సేవించేవారు లేదా ఎవరి మతములో మద్యమునకు అధిక ప్రాధాన్యత గలదో వారికి దైవభీతితో ఎలాంటి సంబంధము లేదు. వారు సత్యమునకు విరుద్ధముగా యుద్ధము చేయుచున్నారు. పాపములకు వ్యతిరేకంగా యుద్ధము చేసేవారు, దైవభీతి, పవిత్రత మైదానములో ప్రగతి చెందే అనుగ్రహము పొందే అదృష్టవంతులు మన జమాఅత్‌నకు లభించినచో ఇది గొప్ప సఫలమగును. దీని కంటే ప్రభావితమైన మరే విషయము లేదు. ఇప్పుడు ప్రపంచములోని మతములన్నిటిని చూచినచో దైవభీతి కనుమరుగైనది, ప్రపంచ చమత్కారములను దేవునిగా చేసుకొన్నట్లు కనిపించును. నిజమైన దేవుడు అదృశ్యమయ్యెను. నిజమైన దేవున్ని అవమానించుచున్నారు. తాను పరిచయం కావాలని, ప్రపంచానికి తన జ్ఞానం కలగాలని అతడిప్పుడు ఆశించు చున్నాడు. ప్రపంచాన్నే దేవునిగా భావించేవారు నమ్మకస్తులు కాలేరు. అల్లాహ్ తఆలా హక్కు చెల్లించే బదులు మనము ప్రాపంచిక ఉద్ధేశములను పొందుటకు కృషి చేయుచున్నామేమోనని ప్రతి ఒక్కరు ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. అల్లాహ్ తఆలా హక్కు చెల్లించదలచినచో ధర్మమునకు ప్రాధాన్యతనివ్వవలెను. ప్రాపంచిక ఉద్ధేశమలును వనెక్కి నెట్టవలెను. మనము ధర్మమునకు ప్రాధాన్యతనిచ్చుచున్నామా లేక ప్రపంచము మనలను జయించుచున్నదా, దైవభీతిలో మనము ముందుకు వెళ్ళుచున్నామా లేక తగ్గుచున్నామా అని పరిశీలించుకోవలెను. ధర్మమును పొందుటకు కృషి చేయువారే అదృష్టవంతులు. మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కంటే గొప్ప పరిపూర్ణ వ్యక్తి ప్రపంచములో మరొకరు జరగలేదు. అయినను వారికి కూడ رَبِّ زِدْنِیْ عِلْمًا అను దుఆ బోధించబడెను. కనుక వారి తరువాత ఎవరు తన జ్ఞానము, విద్యను మాత్రమే నమ్ముకొని, ఇక ప్రగతి అవసరం లేదని భావించి వుండవచ్చును. మానవుడు తన విద్య, జ్ఞానములో పెరిగిన కొద్ది ఇంకా చాలా విషయములు పరిష్కరించ దగ్గవి మిగిలి వున్నవని తెలుసుకొనును.

మీరు అనేక వృథా విషయములను వీడి ఈ సంస్థలో చేరారు. కనుక దీని గురించి పూర్తి వివరాలు, జ్ఞానము తెలుసుకోలేక పోయినచో మీకెలాంటి లబ్ది కలుగును? ఇంతకు ముందు పవిత్ర ఖుర్‌ఆన్ గురించి గ్రహించాలని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశించిరి. ఇదే విధముగా వారి పుస్తకములను చదివి మన ధార్మిక విద్యను పెంపొందించుకొను వైపు దృష్టి సారించవలెను. ఖిలాఫత్‌తో కూడ సంబంధము నెరపుటకు కృషి చేయవలెను. ఇందుకు అల్లాహ్ అందించిన ఎమ్.టి.ఏ. వరము ద్వారా సంప్రదింపులు కొనసాగించవలెను. వర్తమాన ఖలీఫా కార్యక్రమాలన్నిటితో ప్రయోజనము పొందవలెను. ఈ గొప్ప సాధనముచే ప్రతి అహ్మది లబ్ది పొందవలెన. పరస్పరం ప్రేమ, అనురాగము, ఒకరు మరొకరి బాధను అర్థము చేసుకొనుటకు, పరస్పరం హక్కులు

చెల్లించు వైపు దృష్టి సారించవలెనని సూచించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

వాస్తవమేమనగా అంతర్గతంగా జమాఅత్ మొత్తం ఒకే స్థాయి కిలిగి వుండదు. కనుక బలహీన సోదరులకు సహాయము చేయవలెను, వారికి శక్తినివ్వవలెను. وَتَعَاوَنُوا عَلَى الْبِرِّ وَالتَّقْوٰى అనగా పుణ్యము, దైవభీతిలో పరస్పరం సహకరించవలెనని పవిత్ర ఖుర్ఆన్‌లో గలదు. శక్తిమంతులు బలహీనులకు సహకరించనంత వరకు ఏ జమాఅత్ నిలువదు. కనుక ఇతరుల తప్పులను ఎత్తిచూపకూడదు. క్రొత్త ముస్లిముల లోపములను చూచి చిరాకుపడకూదని అనుచరులకు సూచించబడెను. ఎందుకనగా గతములో మీరు కూడ ఇలాగే బలహీనులుగా వుండిరి. ఒకరు మరొకరికి నష్టము కలిగించుచు, నలుగురు కూర్చొని ఒక బీద సోదరునిపై చాడీలు చెప్పుకున్నవారు జమాఅత్ అనబడరు. ఎందుకనగా కలిసి వుండుటకు శక్తి రావలెను, ఐక్యత ఏర్పడవలెను. తద్వారా ఆప్యాయత ఏర్పడును, శుభములు కలుగును. చిన్న చిన్న విషయముల వలన మనసు గాయపరిచే, దుఃఖము కలిగే విధముగా వివాదములకు దిగకూడదు.

నేడు పాకిస్తాన్‌లో వుంటున్న అహ్మదీయులు తమ దీన పరిస్థితుల వలన ఇటు వైపు ప్రత్యేక శ్రద్ధ చూపవలెను. ఎందుకనగా ప్రభుత్వము, చట్ట సభలు, అధికారులు అహ్మదీయులకు వ్యతిరేకంగా గతం కంటే ఎక్కువ చర్యలు చేపట్టుచున్నారు. కనుక ఈ రోజులలో తమ పరిస్థితులలో ప్రత్యేక మార్పు ఏర్పరచుకొనుటకు ప్రయత్నించవలెను.

మనందరము నిజమైన అహ్మదీయులు అగుటకు, వారి (అ) బోధనలను ఆచరించువారిగా అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! అల్లాహ్ తఆలా హక్కులు చెల్లించువారమగుదుము గాక! అతని ప్రీతిని పొందువారమగుదుము గాక! తమను సంస్కరించుకొను వారమగుదుము గాక! తమ విద్యను పెంపొందించుకొను వారమగుదుము గాక! అల్లాహ్ తఆలా దాసుల హక్కులను చెల్లించువారమగుదుము గాక!

ఇప్పుడు పాకిస్తాన్ పరిస్థితుల కొరకు కూడ దుఆ చేయగలరు. పాకిస్తానీయులు స్వయముగా తమ కొరకు కూడ ప్రార్థన చేయవలెను. అల్లాహ్ తఆలా వారిని ప్రతి నష్టము నుండి రక్షించవలెను. దేశములో అంతర్గతంగా ఏర్పడిన అశాంతి నుండి కూడ అల్లాహ్ దేశమును రక్షించుగాక! ఇప్పుడు అతి వేగంగా ప్రపంచము యుద్ధము వైపు వెళ్లుచున్నది. కనుక ప్రపంచము కొరకు కూడ దుఆ చేయగలరు. రష్యా–అమెరికా ఇరువురు సన్నాహాలలో నిమగ్నమైనది. వాస్తవానికి వీరు పైచేయి సాధించుకోదలచినారు. కాని పీడుతల హక్కులు చెల్లించుటకని ప్రజలకు చెప్పుచున్నారు. పీడితుల హక్కులు ఇప్పించాలనే సాకుతో ముస్లిం దేశములను వీరు నాశనం చేయదలచినారు. అల్లాహ్ తఆలా ముస్లిములకు సత్బుద్ధి ప్రసాదించుగాక! ఇతరులతో సహాయము పొందే బదులు వీరు తమ తీర్పులు తామే తీసుకొందురుగాక! ముస్లిములు ఈ హింసలో పాల్గొనే బదులు ఇస్లాం నిజమైన బోధన మేరకు ప్రేమ, అనురాగము, సోదరభావ విద్యను పాటించుచు అల్లాహ్ తఆలా హక్కు చెల్లించువారగుదురు గాక!

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

........................................................................

........................................................................

........................................................................